# ఢిల్లీకి రైల్లో వెళ్లిన జగ్గారెడ్డి..
## మల్లికార్జునఖర్గేను కలిసిన విజయశాంతి

**హైదరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త:** 'ఎమ్మెల్సీ కావాలని వెంటపడి మరీ అడిగే గుణం నాది కాదు, నేను ఎమ్మెల్సీ అదుగుతలేను. నేను అడగొద్దు కూడా' అని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. గురువారం జగ్గారెడ్డి రైలులో ఢిల్లీకి వెళ్లారు. ఎమ్మెల్సీ పదవి కోసం ఢిల్లీకి వెళుతున్నారని ప్రచారం జరగడంతో తాను ఎలాంటి పదవులను ఆశించడం లేదని ఆయన ఖరాఖండిగా తెలిపారు. తనకు పార్టీ ఆల్రెడీ టికెట్ ఇచ్చింది. పోటీ చేసిన. పరిస్థితులు అనుకూలించక ఓడిపోయాను. నేను మూడుసార్లు ఎమ్మెల్యేగా ఉన్నాను. 2017లో రాహుల్ గాంధీ సభ ఏర్పాట్లపై స్పష్టంగా వారి దృష్టికి తీసుకెళ్లాలని గత ఆరునెలల నుండి ఢిల్లీకి వెళ్లి రాహుల్‌గాంధీకి చెప్పాలని అనుకుంటున్నాను, అందుకే ఢిల్లీకి వెళుతున్నానని, ఎవరు కూడా ఊహా గానాలతో తప్పుడు ప్రచారాలు చేయవద్దని ఆయన కోరారు. 2017లో సంగారెడ్డిలో రాహుల్‌గాంధీ సభ ఏర్పాట్ల కోసం తాను ఎంత కష్టపడ్డానో రాహుల్‌గాంధీకి చెప్పడానికి ఈ అవకాశం ఉప యోగించుకొంటున్నానని తెలిపారు. రాహుల్‌గాంధీ సభ ఆర్గనైజేషన్, ఎలాంటి పరిస్థితుల్లో సభ ఏర్పాట్లు చేశానో ఆ విషయాలన్నింటినీ రాహుల్‌గాంధీకి స్వయంగా వివరిస్తాను. ఇదిలా ఉంటే ఢిల్లీకి వెళ్లిన మాజీ ఎంపి విజయశాంతి.. ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేని కలిశారు. ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ సీటుకోసం ఆమె ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీ కోసం తాను చేసిన త్యాగాలను పరిగణనలోకి తీసుకొని అవకాశం కల్పించాలని ఆమె మల్లికార్జునఖర్గేను అడిగే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా, విజయశాంతి ఇంటికి మీనాక్షీ నటరాజన్ వెళ్లి కలవడం చర్చనీయాంశంగా మారింది.

# మెరుగుపడుతున్న కల్పన ఆరోగ్య పరిస్థితి

**హైదరాబాద్ (కెపిహెచ్‌బి కాలనీ), మార్చి 6, ప్రభాతవార్త:** అధిక మోతాదులో నిద్ర మాత్రలు వేసుకుని ఆస్పత్రిపాలైన సినీనేపథ్యగాయని కల్పన ఆరోగ్యం మెరుగు పడుతున్నది. చికిత్స తర్వాత కోలుకుంటున్న కల్పనను పోలీసులు విచారించారు. తాను ఆత్మహత్యాయత్నానికి పాల్పడలేదని, భర్తతో తనకు ఎలాంటి విభేదాలు లేవని, నిద్రపట్టక పోవడంతో ఎక్కువ సంఖ్యలో నిద్రమాత్రలు వేసుకున్నానని కల్పన పోలీసులకు తెలిపారు. గురువారం శ్రీశ్రీ హోలిస్టిక్ ఆస్పత్రి వైద్యులు కల్పన ఆరోగ్యం మెరుగుపడుతున్నదని ప్రకటించారు. కల్పన ఆరోగ్యం నిలకడగా ఉండటంతో వెంటిలేటర్ తొలగించి చికిత్స అందిస్తున్నామని, పూర్తిగా కోలుకున్న తర్వాత డిశ్చార్జ్ చేస్తామని పేర్కొన్నారు. తమిళనాడుకు చెందిన కల్పన తెలుగు, తమిళంసహా పలుభాషల్లో గాయనిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ కేపీహెచ్‌బీలోని నిజాంపేట వర్టెక్స్ ప్రీ విలేజ్ గేటెడ్ కమ్యూనిటీలోని విల్లాలో నివాసముంటున్నారు. కల్పన తెలుగులో ఎన్నోపాటలు పాడారు. ఆమె పాడిన పాటల్లో కొన్నింటికి రివార్డులు వచ్చాయి.



ప్రముఖ గాయని కల్పన (ఫైల్)

## పాండిచ్చేరి సెంట్రల్ వర్సిటీ విసిగా ప్రకాష్‌బాబు

**హైదరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త:** పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌గా ప్రొఫెసర్ పి ప్రకాష్‌బాబు నియమితులయ్యారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను కేంద్ర విద్యాశాఖ గురువారం జారీ చేసింది. హైదరాబాద్ యూనివర్సిటీ (యూఓహెచ్)లోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లోని బయోటెక్నాలజీ బయోఇన్ఫర్మేటిక్స్ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్‌గా కొనసా గుతున్న ప్రొఫెసర్ ఫణితి ప్రకాష్ బాబును పాండిచ్చేరి యూనివర్సిటీ విసిగా నియమించారు. ఆయన 5సంవత్సరాల పాటు పాండిచ్చేరి యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్‌గా కొనసాగనున్నారు. ప్రొఫెసర్ ప్రకాష్ బాబు నాగార్జున యూనివర్సిటీ నుండి జువాలజీలో బీఎస్సీ, ఆంధ్ర యూనివర్సిటీ నుండి జువాలజీలో ఎంఎస్సీ, హైదరాబాద్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ నుండి పీహెచ్‌డీ సాధించారు.

## ఆనంద వికటన్‌పై నిషేధం తొలగించండి

### వెబ్‌సైట్ నుంచి వివాదాస్పద కార్టూన్ కూడా..

### కేంద్రం, వికటన్‌లకు మద్రాసు హైకోర్టు ఆదేశాలు

**చెన్నై, మార్చి 6:** తమిళ వెబ్‌సైట్ ఆనందవికటన్‌పై కేంద్రం విధించిన నిషేధాన్ని తొలగించాలని మద్రాసు హైకోర్టు తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర సమాచార ప్రసారమంత్రిత్వశాఖకు హైకోర్టు ఈమేరకు ఆదేశాలు జారీచేసింది. నరేంద్రమోడీపై వేసిన కార్టూన్‌ను తొలగించిందని అందువల్లనే నిషేధం తొలగించాలని సూచించింది. మోడీపై వేసిన కేరికేచర్ ఐటి చట్టం సెక్షన్ 69(ఎ) కిందకు వస్తుందా లేదా అన్నది పరిశీలనచేసానతమని, అయితే కళాత్మక, జర్నలిస్టు స్వేచ్ఛపరిధిలోకి వస్తుందా రాదా అనేది కూడా నిర్ధారణ చేయాల్సి ఉందన్నారు. మ్యాగజైన్ సంపాదకులు వికటన్ తన ఎక్స్ ఖాతాలో ప్రకటన చేస్తూ కార్టూన్‌ను తొలగించినట్లు తెలిపారు. వికటన్ తరపు వాదించిన న్యాయవాదులు మాట్లాడుతూ ఈ కార్టూన్ వల్ల భారతన సార్వభౌమత్వం, సమైక్యతకు ఎలాంటి భంగం వాటిల్లదని, అమెరికాతో ఉన్న స్నేహ పూర్వక సంబంధాలకకు ఎలాంటి విఘాతం కలుగదని వాదించారు. ప్రభుత్వం తరపున అదనపు సొలిసిటర్‌జనరల్ ఎఆర్ఎల్ సుందరేశన్ వాదనలు వినిపించారు. అమెరికాలో పట్టుబడిన అక్రమవలసదారులకు సంకెళ్లు వేసి మరీ విమానాలు ఎక్కించారన్న వార్తలను స్పురిస్తూ ప్రధాని మోడీ చేతులకు కాళ్లకు సంకెళ్లువేసి ట్రంప్ పక్కన కూర్చుని ఉండగా ట్రంప్ వెక్కిరిస్తున్నట్లుగా కార్టూన్ వేసారు. అయితే పత్రికాస్వేచ్ఛను హరించిందని, భారత సార్వభౌమత్వానికి భంగం కలిగించేలా కార్టూన్ ఉందంటూ గతనెల 15వ తేదీనుంచి ఈ పత్రికపై నిషేధంప్రకటించారు. తర్వాత 20వ తేదీ వికటన్ సంపాదకవర్గం సమగ్రమైన లేఖను సమాచార శాఖకు అందించినా ఫలితం లేకపోవడంతో నిషేధంపై తమిళనాడు హైకోర్టును ఆశ్రయించారు.

## 'పెసా'కు రూ.33 కోట్లు విడుదల

**హైదరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త :** పెసా (పంచాయతీస్ టూ ద షిఫ్త్ షెడ్యూల్ ఏరియా) బలోపేతం కోసం ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. దీనిలో భాగంగా పెసా కో ఆర్డినేటర్లు, మోబిలైజర్లు వేతనాలతో పాటు పెసా ఇతర కార్యక్రమాల కోసం రూ.33 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. అటవీ ప్రాంతాల్లో ఆదివాసీ హక్కులు, అభివృద్ధిపై ఈ మోబిలైజర్లు అవగాహన కల్పిస్తారు. పెసా పరిధిలో నలుగురు కో ఆర్డినేటర్లు, 600 మంది మోబిలైజర్స్ పని చేస్తున్నారు.

## పెంపుడు కుక్క చనిపోతే..
## విషాదంలో మంత్రి కొండా సురేఖ



**వరంగల్ బ్యూరో, ప్రభాత వార్త:** తన చుట్టూ ఉన్న మనుషులతోనే కాదు.. మూగజీవాలతోనూ భావోద్వేగభరిత సత్సంబంధాలు నెరిపిన మనసున్న నేత మంత్రి కొండా సురేఖ. గురువారం ఉదయం మంత్రి కొండా సురేఖ గృహంలో తన పెంపుడు కుక్క హ్యాపీ ఆకస్మికంగా మృతి చెందింది. అల్లారు ముద్దుగా చూసుకున్న హ్యాపీ హఠాత్తుగా చనిపోవడంతో సురేఖ కన్నీరు మున్నీరయ్యారు. హ్యాపీకి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. పెంపుడు కుక్క హఠాన్మరణంతో మంత్రి కుటుంబీకులు, సిబ్బంది కన్నీటి పర్యంతమయ్యారు.

# 2003 డిఎస్‌సి ద్వారా నియమితులైన టీచర్లకు పాత పెన్షన్‌ను వర్తింపచేయాలి

### సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన నూతన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 6:** వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గ నుంచి శాసనమండలికి ఎన్నికైన పింగిలి శ్రీపాల్‌రెడ్డి గురువారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ప్రజా ప్రభుత్వానికి సహకరిస్తామని ముఖ్యమంత్రికి ఆయన తెలిపారు. ఈ ఎన్నికలో విజయం సాధించిన శ్రీపాల్‌రెడ్డికి ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో 2003 డిఎస్‌సి ద్వారా నియామకం అయిన ఉపాధ్యాయులకి పాత పెన్షన్‌ను వర్తింప చేయాలని వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి కోరారు.

ఈ నెల 27న జరిగిన నల్గొండ ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికల్లో విజయం సాధించిన పింగిలి శ్రీపాల్ రెడ్డి గురువారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్సీగా విజయం సాధించిన శ్రీపాల్ రెడ్డికి ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు.



గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసిన నూతన ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికైన పింగిలి శ్రీపాల్‌రెడ్డి తదితరులు

సీఎంని కలిసిన వారిలో పిఆర్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి మోహన్ రెడ్డి, మాజీ రాష్ట్ర అధ్యక్షులు పి వెంకట్ రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి గుండు లక్ష్మణ్ ఉన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలను శ్రీపాల్ రెడ్డి సీఎం దృష్టికి తీసుకొచ్చారు.

2003 డిఎస్‌సి ఉపాధ్యాయులు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలననుసరించి పాత పెన్షన్ విధానాన్ని వర్తింపచేయాలని ముఖ్యమంత్రి గారిని కోరారు. స్పందించిన ముఖ్యమంత్రి ఈ విషయాలను సంబంధిత అధికారులచేత పరిశీలింపజేసి ఆదేశాలు జారీ చేస్తానని తెలిపారని పిఆర్‌టియు నాయకులు తెలిపారు. ఉపాధ్యాయులకి ఏకీకృత సర్వీసు నిబంధనలు రూపొందింపచేసి ఉన్నతస్థాయి ప్రమోషన్లు ఇవ్వాలని.. అలాగే విద్యా శాఖలో ఖాళీలు ఏర్పడగానే విద్యార్థులు నష్టపోకుండా వెంటనే ప్రమోషన్స్ ఇచ్చేవిధంగా ఇప్పటికే ఉన్న జీవో నంబర్ 67 పునరుద్ధరింప చేయాలని కోరారు. 12 సంవత్సరాలు పూర్తయిన స్కూల్ అసిస్టెంట్, 24 సంవత్సరాలు పూర్తయిన సెకండరీ గ్రేడ్ టీచర్స్(ఎస్‌జిటి) అర్హతలను పరిశీలించి గెజిటెడ్ హోదా కల్పించాలని కోరారు.

ఎమ్మెల్సీ సీఎం దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిశీలింపచేసి ఆదేశాలు ఇస్తామని ముఖ్యమంత్రి తెలిపారని.. అదేవిధంగా పెండింగ్ బిల్లుల గురించి ప్రస్తావించగా ఏప్రిల్ నెల నుండి చెల్లిస్తామని ముఖ్యమంత్రి తెలియచేశారని ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి తెలిపారు.

# తమిళానికి మద్దతు దురభిమానం కాదు..

### ముఖ్యమంత్రి స్టాలిన్

**చెన్నై, మార్చి 6:** తాము భాషా సమానత్వాన్ని కోరుకుంటున్నామని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ అన్నారు. తమిళనాడులో ప్రాధాన్యం కల్పించమని అడిగితే దానిని దురభిమానం అనే ముద్ర వేస్తున్నారని విమర్శించారు. కేంద్ర నూతన జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకిస్తూ తాజాగా మరోసారి ఎక్స్ వేదికగా ఆయన పోస్టు పెట్టారు. జాతీయ విద్యావిధానంలో భాగమైన త్రిభాషా సూత్రం అమలుపై తమిళనాడు, కేంద్ర ప్రభుత్వాల మధ్య వివాదం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. నూతన విద్యావిధానం ద్వారా హిందీని బలవంతంగా రుద్దుతున్నారంటూ రాష్ట్రానికి రావాల్సిన నిధులను నిలిపివేశారని



స్టాలిన్ ప్రభుత్వం కేంద్రంపై ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. భాషలను రాజకీయ కోణంలో చూడవద్దంటూ కేంద్రాన్ని కోరింది. ఈ నేపథ్యంలో ఆయన మరో పోస్టు పెట్టారు. మీరు ప్రత్యేక హక్కులకు అలవాటుపడటంతో సమానత్వం కూడా అణచివేతలా కనిపిస్తుంది అంటూ ఒక ప్రముఖ సూక్తిని ప్రస్తావించారు. 'తమిళనాడులో తమిళానికి ప్రాధాన్యం ఉండాలని డిమాండ్ చేసినందుకు మాది దురభిమానం అని ముద్ర వేస్తున్నారు. దురభిమానం ఎలా ఉంటుందంటే తమిలులు అర్థం చేసుకోలేని భాషలో మూడు క్రిమినల్ చట్టాలకు పేర్లు పెట్టడంలా ఉంటుంది. దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించే రాష్ట్రానికి ప్రాముఖ్యత ఇవ్వకపోవడం, ఎన్ఇపిని నిరాకరించినందుకు విద్యకు వెచ్చించాల్సిన నిధులను ఆపేయడం దాని కిందికే వస్తుంది. గాడ్సే భావజాలాన్ని కీర్తించే వ్యక్తులు చైనా దురాక్రమణ, కార్గిల్ యుద్ధం, బంగ్లాదేశ్ విముక్తి కోసం జరిపిన యుద్ధాల్లో అత్యధిక నిధులు అందించిన డిఎంకె, ఆ పార్టీ నేతృత్వంలో ప్రభుత్వ దేశభక్తిని ప్రశ్నిస్తున్నారని దుయ్యబట్టారు.

# టాస్క్ సంస్థకు నీతిఆయోగ్ ప్రశంసలు

### యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఎంతో కృషి చేశాం: మాజీమంత్రి కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మార్చి 6:** తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్)కు నీతి ఆయోగ్ ప్రశంసలు దక్కాయి. ఈ సందర్భంలో నీతి ఆయోగ్ ప్రశంసలు తెలంగాణ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు గత మా బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన కృషికి నిదర్శనమని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కల్వకుంట్ల తారక రామారావు పేర్కొన్నారు. సోషల్ మీడియాలో నీతి ఆయోగ్ నివేదిక గురించి ప్రస్తావిస్తూ, టాస్క్ ద్వారా తెలంగాణ యువతకు, విద్యార్థులకు కలిగిన ప్రయోజనాలను కేటీఆర్ గుర్తు చేశారు. 2014లో తెలంగాణ ప్రభుత్వం, కేసీఆర్ మార్గదర్శనంలో టాస్క్‌ను ప్రారంభించి, అనేక విజయాలు సాధించిందని కేటీఆర్ తెలిపారు. ముఖ్యంగా, టాస్క్ ద్వారా పారిశ్రామిక వర్గాలు, విద్యారంగం, ప్రభుత్వాలను కలుపుతూ, నాణ్యమైన మానవ వనరుల తయారీకి, శిక్షణకు టాస్క్ ఎంతగానో ఉపయోగపడిందని ఆయన అన్నారు. టాస్క్ సాధించిన విజయాలను నీతి ఆయోగ్ తన నివేదికలో ప్రత్యేకంగా ప్రస్తావించడం పట్ల కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఇది గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ యువత కోసం స్కిల్లింగ్ రంగంలో చేసిన సేవకు దక్కిన గుర్తింపని ఆయన అభివర్ణించారు. ముఖ్యంగా, 761 కాలేజీలలోని విద్యార్థులకు శిక్షణ ఇచ్చిందని, 9 లక్షల 84 వేల మంది విద్యార్థులకు 18,650 మంది ఫ్యాకల్టీకి శిక్షణ అందించిందని ఆయన గుర్తు చేశారు. 80 పారిశ్రామిక సంస్థలతో భాగస్వామ్యాలు ఏర్పాటు చేసుకుని, 35 వేల మందికి పైగా విద్యార్థులకు, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించిందని కేటీఆర్ తెలియజేశారు. నైపుణ్యవంతమైన తెలంగాణను ఏర్పాటు చేసే దిశగా టాస్క్ సంస్థ ఆవిర్భావం, దాని పనితీరు ఒక గొప్ప మైలురాయిగా నిలిచిపోతుందని అన్నారు. స్కిల్లింగ్ రంగంలో అందరికీ అవకాశాలు అందేలా, విద్యార్థులకు ఉద్యోగాలు అందేలా, నైపుణ్యం కల్పించేలా టాస్క్ గొప్పగా పని చేసిందని నివేదికలో తెలియజేసింది. ముఖ్యంగా, సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి టాస్క్ సంస్థ ద్వారా ఎంతగానో లబ్ధి చేకూరిందని పేర్కొంది. పారిశ్రామిక వర్గాల అవసరాలకు అనుగుణంగా టాస్క్ ఇచ్చిన శిక్షణ వల్ల విద్యార్థులు, యువత ఉపాధి అవకాశాలను సులభంగా పొందగలిగారని, టాస్క్ పనితీరును నీతి ఆయోగ్ అభినందించింది.

# హైదరాబాద్ కేంద్రంగా నకిలీ కాల్‌సెంటర్ గుట్టురట్టు

### అమెరికాకు చెందిన వారే వీరి లక్ష్యం
### దుబాయి నుంచి చక్రం తిప్పుతున్న నేరగాళ్లు

**హైదరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త :** హైదరాబాద్‌ను కేంద్రంగా చేసుకుని పనిచేస్తున్న నకిలి కాల్‌సెంటర్ గుట్టును సైబర్ సెక్యూర్టీ బ్యూరో అధికారులు రట్టు చేశారు. ముఖ్యంగా అమెరికన్లను లక్ష్యంగా చేసుకుని వారిని నిలువు దోపిడి చేస్తున్న మనస్విని వారు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సైబర్ సెక్యూర్టీ బ్యూరో డిజి శిఖా గోయల్ గురువారం మీడియా ప్రతినిధులకు తెలిపారు.

హైటెక్ సిటీలో ఎక్సిటో సోల్యూషన్ పేరుతో నగరానికి చెందిన మనస్విని కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. తన వద్ద పని చేసే ఈశాన్య రాష్ట్రాలకు చెందిన సిబ్బందితో సోషల్ మీడియా ద్వారా ఆధునిక టెక్నాలజిని ఉపయోగించి అమెరికాలో ఉండే వారి వివరాలతో పాటు వారి బ్యాంక్ ఖాతా వివరనాలను, క్రెడిట్, డెబిట్ కార్డుల వివరాలను సేకరించేవారు. దీని ద్వారా అమెరికాలో మీరు తప్పుడు పద్దతులు అవలంభించి డబ్బు సంపాదించారని వారిని బెదిరించి పెద్దఎత్తున డబ్బును గుంచే వారు. మస్వినితో పాటు గుజరాత్‌కు చెందిన కైవాన్ పటేల్, రాహుల్, ప్రతీక్ అనే వ్యక్తులు దుబాయ్ నుంచి ఇందుకు సంబంధించిన వ్యవహారాలను నడిపేవారని ఆమె తెలిపింది. పక్కా సమాచారం మేరకు సైబర్ సెక్యూర్టీ బ్యూరో సిబ్బంది కార్యాలయంపై దాడి నిర్వహించి నిర్వాహకురాలు మనస్వినితో పాటు అక్కడ పని చేసే ఈశాన్య రాష్ట్రాలకు సంబంధించిన 62 మంది కాల్ సెంటర్ సిబ్బందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 63 సెల్‌ఫోన్‌లు, ఐడీ కార్డులు, పెద్ద ఎత్తున కంప్యూటర్లు స్వాధీనం చేసుకున్నట్లు సెక్యూర్టీ బ్యూరో డిజి శిఖాగోయల్ తెలిపారు. వీరు ఎంత మందిని మోసం చేశారు. ఎంత పెద్దమొత్తంలో దోచుకున్నారు అనే వివరాలను దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన మున్సిపల్ కమిషనర్

### రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు

**ధర్మపురి, ప్రభాతవార్త:** ధర్మపురి మున్సిపల్ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి, ఓ తాత్కాలిక ఉద్యోగి నుండి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రూ.20 వేలు లంచం తీసుకుం టుండగా అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడంతో ఇట్టి సంఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. బాధితుడు పైడిపెల్లి మహేష్ తెలిపిన ప్రకారం .. మహేష్ గత నాలుగు సంవత్సరాల నుండి మున్సిపల్ కార్యాలయంలో పర్యావరణ ఇంజినీర్‌గా తాత్కాలికంగా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా కమిషనర్ కొన్ని నెలల నుండి వేతనం చెల్లించే విషయంలో తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

గతంలో తన వేతనం పెరిగిన సమయంలో వాటిని చెల్లించేందుకు రూ. 10 వేలు డిమాండ్ చేయగా వాటిని కమిషనర్ కు చెల్లించాడు. అలాగే మహేష్ కు 6 నెలల నుండి వేతనం పెండింగ్‌లో ఉండగా తన వేతనం చెల్లించాలని కమిషనర్‌ను ప్రతిరోజు వేడుకుంటుండగా, అందుకు





ఎసిబికి పట్టుబడిన మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

కమిషనర్ ఏదో సాకులు చెప్తూ వాయిదా వేసు_తున్నాడు. బుధవారం సదరు ఉద్యోగి మరోసారి తన వేతనం చెల్లించాలని, ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవు తున్నాయని వేడుకోగా, వేతనం చెల్లించ దానికి కమిషనర్ రూ. 20 వేలు డిమాండ్ చేశాడు. అందుకు విసుగు చెందిన మహేష్ బుధవారం ఏసీబీ అధికారులను ఆశ్రయించగా, అధికారులు సూచించినట్లుగా గురువారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కు రూ. 20 వేలు లంచం ఇస్తుండగా, అంతకు ముందే కార్యాలయం సమీపాన కాపు కాసిన ఏసీబీ డిఎస్పి రమణమూర్తి తమ సిబ్బందితో కలిసి మున్సిపల్ కమిషనర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టు కొని కేసు నమోదు చేశారు. డిఎస్పీ వెంట ఇన్‌స్పెక్టర్లు తిరుపతి, కృష్ణకుమార్ ఉన్నారు.

# కృష్ణా జలాల వివాదంలో స్టే ఇవ్వని సుప్రీంకోర్టు

**హైదరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త :** కృష్ణా జలాల వివాదాలకు సంబంధించి సెక్షన్-3 అనుసరించి విచారణ కెడబ్ల్యుడిటి-2 చేపట్టకుండా స్టే ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ చేసిన అభ్యర్థనపై సుప్రీంకోర్టు ఏ నిర్ణయం తీసుకోకుండా ఏప్రిల్23కు వాయిదా వేసింది. కృష్ణానదిజలాల వివాదాల ట్రిబ్యునల్-2 లో మార్చి24 నుంచి 26 వరకు తెలంగాణ ప్రభుత్వం వాదనలు వినిపించడానికి షెడ్యూల్ ఖరారు చేయబడిన అంశంలో కూడా ఏలాంటి జోక్యం ఉన్నత న్యాయస్థానం చేసుకోలేదు. గురువారం మధ్యాహ్నం రెండున్నరకు డబ్ల్యుపి 1230 బెంచ్‌పైకి రావాల్సి ఉండగా రాలేదు దీనిని ఏప్రిల్ 23 మధ్యాహ్నం రెండుగంటలకు ఉంటుందని ధర్మాసనం తెలిపింది.

## ఎమ్మెల్సీలుగా గెలిచిన ఎన్డీయె అభ్యర్థులకు ప్రధాని అభినందనలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, మార్చి 6:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వెలువడిన విషయం తెలిసిందే. ఈ ఫలితాల్లో విజయం సాధించిన అభ్యర్థులకు ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఎక్స్(ట్విట్టర్) ద్వారా అభినందనలు తెలిపారు. తెలంగాణకు చెందిన మల్క కొమరయ్య, అంజిరెడ్డిని ప్రధాని అభినందించారు. బిజెపికి మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ప్రజలతో కలిసి పని చేస్తున్న ప్రతీ ఒక్క కార్యకర్తను చూసి గర్విస్తున్నానని మోడీ పేర్కొన్నారు. మరోవైపు ఎపిలో విజయం సాధించిన ఎమ్మెల్సీలకు శుభాకాంక్షలు తెలుపుతు ముఖ్యమంత్రి చంద్రబాబు పెట్టిన పోస్టును మోడీ రీపోస్ట్ చేశారు. కేంద్రం, ఎపి ప్రభుత్వం ప్రజలకు సేవ చేస్తుందని.. రాష్ట్ర అభివృద్ధికి ప్రయాణాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్తుందని మోడీ పేర్కొన్నారు.

**శుభాకాంక్షలు తెలిపిన జెపి నడ్డా**

అలాగే బిజెపి జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కూడా అభ్యర్థులకు శుభాకాంక్షలు చెప్పారు. ఎన్డీయే అభ్యర్థులను గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మోడీ నేతృత్వంలో దేశంలో, రాష్ట్రంలో మరిన్ని విజయాలు దక్కుతాయని సిఎం చంద్రబాబు అన్నారు. ఎన్డీఏ పాలనలో అన్నివర్గాల ప్రజలకు అభివృద్ధి దక్కుతుందని పేర్కొన్నారు.



## త్రిభాషాసూత్రంపై సంతకాల సేకరణ

### తమిళిసై సౌందరరాజన్‌ను అదుపులోకి తీసుకున్న చెన్నై పోలీసులు

**చెన్నై, మార్చి 6:** తెలంగాణ, పుదుచ్చేరిల మాజీ గవర్నర్ బిజెపి నాయకురాలు తమిళిసై సౌందరరాజన్‌ను చెన్నైలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం ఆమె త్రిభాషా సూత్రంపై సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టగా పోలీసుల అనుమతి లేకుండానే ఈ కార్యక్రమంచేపట్టారని పేర్కొంటూ పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. జాతీయ విద్యావిదానం కింద త్రిభాషా సూత్రం అమలుచేయాలని కేంద్రం భావిస్తుంటే డిఎంకె హిందీభాషను వ్యతిరేకిస్తున్న సంగతి తెలిసిందే. సమాన విద్య మనందరి హక్కు అన్న నినాదం తమిళంలో సమకల్వి ఎంగల్ ఉరిమై నినాదంతో ఈ ప్రచారజాతాను చేపట్టారు. తమిళనాడు బిజెపి జాతీయ విద్యావిధానానికి మద్దతుగా త్రిభాషా సూత్రం అమలుకావాలంటూ సంతకాల సేకరణకు ఉపక్రమించింది. తమిళనాడు బిజెపిచీఫ్ కె అన్నామలై తమిళిసైను పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. అధికార డిఎంకె ప్రభుత్వం అణిచివేతకు పాల్పడుతోందని ఆరోపించారు. తమిళభాషను వాణిజ్యీకరణ చేసిందని, త్రిభాషా సూత్రం కేవలం ప్రైవేటు స్కూళ్లకే పరిమితం చేయాలని చూస్తోందన్నారు.

## 10 నుంచి ఇంటర్ మూల్యాంకనం ప్రారంభం

**హైదరాబాద్, మార్చి 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ నెల 5 నుంచి ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఇంటర్ పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాల మూల్యాంకనం ఈ నెల 10 నుంచి ప్రారంభించనున్నారు. ఈ నెల 10 నుంచి సంస్కృతం మూల్యాంకనం ప్రారంభం కానుంది. ఆ తరువాత నాలుగు విడతల్లో లాంగ్వేజెస్‌తో పాటు సబ్జెక్టుల మూల్యాంకనను కొనసాగించనున్నారు. ఈ ఏడాది 19 కేంద్రాల్లో మూల్యాంకనాన్ని కొనసాగించనున్నారు. గత ఏడాది 17 కేంద్రాల్లో మూల్యాంకనం జరగగా.. ఈ ఏడాది అదనంగా వరంగల్, మెదక్ లోనూ మూల్యాంకన కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ నెల 10 నుంచి సంస్కృతం మూల్యాంకనం ప్రారంభం కానుండగా.. మొదటి విడత మూల్యాంకనం ఈ నెల 22 నుంచి ప్రారంభం కానుంది. మొదటి విడతలో ఇంగ్లీష్, తెలుగు, హిందీ పేపర్-1, 2తోపాటు గణితం, పొలిటికల్ సైన్స్ సబ్జెక్టుల మూల్యాంకనం ప్రారంభిస్తారు. రెండో విడత ఈ నెల 24 నుంచి ఫిజిక్స్, ఎకనామిక్స్, మూడో విడత 26 నుంచి ప్రారంభం కానుండగా.. మూడో విడతలో కెమిస్ట్రీ, కామర్స్ సబ్జెక్టులు.. ఇక చివరి విడతగా ఈ నెల 28న నాలుగో విడతలో హిస్టరీ, బోటనీ, జువాలజీ సబ్జెక్టుల మూల్యాంకనం ప్రారంభం కానుంది. ఏప్రిల్ 15 నుంచి 20 లోపుగా మూల్యాంకనాన్ని ముగించేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్టు తెలుస్తోంది.

## కోనాపురం సమీపంలో ట్రక్కు బోల్తా

### ఒకరి మృతి.. మరికొందరి పరిస్థితి విషమం

**చెన్నారావుపేట, మార్చి 6, ప్రభాతవార్త:** ఉన్న ఊరిలో పనులు లేక పొట్టకూటి కోసం దూర ప్రాంతాలకు కూలి పనుల కోసం వెళుతున్న గిరిజన కూలీలు వాహనం బోల్తాపడగా ఒకరు మృతిచెందగా మరికొంత మంది ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండి పలువురికి తీవ్ర గాయాలైన విషదకర సంఘటన చెన్నారావుపేట మండలంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నర్సంపేట మండలం ఇప్పల్‌తండాలో రైతు దారావత్ మైబు మిరప తోట ఏరే పనులు ఉన్నాయని జీడిగడ్డతండా గ్రామానికి చెందిన భూక్య సమ్మిక్కి సమాచారం ఇచ్చారన్నారు. దీంతో సుమారు 37మంది తండావాసులు తెల్లవారుజామునే సిద్ధమయ్యారు. వారంతా టీజీ24టి1472 గూడ్స్ వాహనంలో బయల్దేరారన్నారు. కోనాపురం గ్రామం దాటాక అతివేగం డ్రైవర్ నిర్లక్ష్యంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడిందన్నారు. కాగా ఈ ఘటనలో తండాకు చెందిన బానోతు సుక్య(55) అనే వ్యక్తి తీవ్ర గాయాలు కాగా వెంటనే నర్సంపేటలోని ప్రభుత్వ ఆసుపత్రి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడన్నారు. అలాగే బానోతు ఈర్య ఎంజిఎంలో చికిత్స పొందుతుండగా ఆరోగ్యం అత్యంత విషమంగా మారిందన్నారు.

## గురుత్వాకర్షణ సిద్ధాంతం న్యూటన్ గుర్తించడానికి పూర్వమే వేదాల్లో ఉంది!

### రాజస్థాన్ గవర్నర్ హరిబాపు బాగ్డే

**జైపూర్, మార్చి 6:** రాజస్థాన్ గవర్నర్ హరిబాపు బాగ్డే ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 1687లో గురుత్వాకర్షణ సిద్ధాంతం న్యూటన్ గుర్తించడానికి చాలా పూర్వమే మన వేదాల్లో దాని గురించి ప్రస్తావన ఉందని అన్నారు. జైపుర్‌లోని ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీలో జరిగిన స్నాతకోత్సవంలో బాగ్డే ఈ విధంగా వ్యాఖ్యానించారు. పురాతన కాలం నుంచి భారత్ విజ్ఞానకేంద్రంగా ఉంది. నలంద యూనివర్సిటీ వంటి విద్యాసంస్థలకు దేశవిదేశాల నుంచి విద్యార్థులు వచ్చేవారు. డెసిమల్ వ్యవస్థను భారత్ ప్రపంచానికి అందించింది.

